సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



బీజేపీదే కీలక పాత్ర

రాష్ట్రంలో రానున్న రోజుల్లో బీజేపీ కీలక పాత్ర పోషించనుందని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. 8లో▸



కాంగ్రెస్‌తోనే సంక్షేమం

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనతోనే ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 8లో▸



పూర్తి విచారణ చేపట్టాలి

హత్యాయత్నం కేసులో పోలీసులు విచారణ చేపట్టి నిందితులను అరెస్టు చేయాలని సంజీవ్‌నాయక్ డిమాండ్ చేశారు. 8లో▸

..అనే నేను

రాష్ట్ర మూడవ శాసనసభ శనివారం కొలువుదీరింది. జిల్లా పరిధిలో శాసనసభ్యులుగా ఎన్నికైన కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు. ఏఐఎంఐఎం సీనియర్ శాసన సభ్యుడు, ప్రొటెమ్ స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు.

– రంగారెడ్డి, నెట్‌వర్క్



కల్వకుర్తి ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేస్తున్న నారాయణరెడ్డి



ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి రంగారెడ్డి



షాద్‌నగర్ ఎమ్మెల్యేగా వీర్లపల్లి శంకర్



మహేశ్వరం ఎమ్మెల్యేగా సబితారెడ్డి



చేవెళ్ల ఎమ్మెల్యేగా కాలె యాదయ్య

విన్నపాలు వింటారిక!

- బల్దియాలో త్వరలో ఫిర్యాదుల స్వీకరణ
- ప్రజా దర్బార్‌కు యంత్రాంగం చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: కోటిమందికి పైగా ప్రజలకు వివిధ రకాల సేవలందించే బల్దియాలో త్వరలో ప్రజా ఫిర్యాదుల్ని విననున్నారు. వారి విజ్ఞప్తులు స్వీకరించనున్నారు. ఈ మేరకు అధికారులు సిద్ధమవుతున్నారు. జీహెచ్ఎంసీలో ఫిర్యాదుల స్వీకరణకు కాల్‌సెంటర్ ఉన్నప్పటికీ, దాని సేవలపై ప్రజలు సంతృప్తిగా లేరు. కేవలం ఫోన్ ద్వారా సమస్య చెబితే ఆపరేటర్లు నమోదు చేసుకోవడం తప్ప వారి వేదన స్వయంగా అధికారులకు విన్నవించే పరిస్థితి లేదన్న అసంతృప్తి ప్రజల్లో ఉంది. జీహెచ్ఎంసీలో గతంలో ప్రతి సోమవారం 'ప్రజావాణి' పేరిట అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే వారు. వారి వేదనల్ని వినేవారు. పరిష్కారం కాకపోతే ప్రజలు మళ్లీ వచ్చేవారు. మూడేళ్ల క్రితం కోవిడ్ తరుణంలో ఆ కార్యక్రమాన్ని ఎత్తివేశారు. అనంతరం వివిధ యంత్రాంగాలు కోవిడ్ కారణంగా ఎత్తివేసిన కార్యక్రమాల్ని తిరిగి పునరుద్ధరించినప్పటికీ జీహెచ్ఎంసీ మాత్రం పునరుద్ధరించలేదు. ప్రజావాణి కార్యక్రమం అమలులో ఉన్న సమయంలోనూ గత పాలకమండలిలో మేయర్ సైతం వారానికోసారి 'ఫోన్–ఇన్' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల్ని నేరుగా వినేవారు. పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించేవారు. మేయర్ ఆదేశాలు కావడంతో అధికారులు వెంటనే పరిష్కరించేవారు. కొత్త పాలకమండలి ఏర్పాటయ్యాక అటు ప్రజావాణి లేక, ఇటు ఫోన్–ఇన్ అందుబాటులో లేక ప్రజలు తమ సమస్యల్ని పాలకమండలికి కానీ, అధికారులకు కానీ నేరుగా విన్నవించుకునే పరిస్థితి లేకుండా పోయింది.

కొరవడిన జవాబుదారీతనం

- కాల్ సెంటర్ ఉందని చెబుతున్నప్పటికీ, ఫిర్యాదుల స్వీకరణ తప్ప పరిష్కారంపై జవాబుదారీతనం లేదు. ఎన్నికల అనంతరం ప్రజావాణిని పునరుద్ధరించే యోచన ఉందని కొద్దిరోజుల క్రితం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. సీఎం క్యాంప్ కార్యాలయం నుంచే 'ప్రజాదర్బార్'లో ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. జీహెచ్ఎంసీ స్థాయిలోనే ప్రజల ఫిర్యాదుల్ని పరిష్కరిస్తే జీహెచ్ఎంసీకి సంబంధించిన సమస్యలపై ప్రజాదర్బార్‌లో తాకిడి తగ్గుతుందనే యోచనలో ఉన్నారు.
- ప్రజాదర్బార్‌కు అందే ఫిర్యాదుల్లో జీహెచ్ఎంసీకి సంబంధించినవి ఎక్కువ ఉంటే చెడ్డపేరు వస్తుంది. అధికారులపై విమర్శలు వస్తాయి. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరితంగా తిరిగి ఫిర్యాదులు స్వీకరించే కార్యక్రమాన్ని అమలులోకి తేవాలనే యోచనలో అధికారులున్నారు.

న్యూస్‌రీల్

చిలుకూరు బాలాజీ సేవలో తాండూరు ఎమ్మెల్యే



చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌తో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

మొయినాబాద్: తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభ శనివారం కొలువుదీరింది. ఈ నేపథ్యంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చిలుకూరు బాలజీని దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం ఆలయ అర్చకుడు రంగరాజన్ ఆయనకు ఆశీర్వచనం అందించారు. ఆలయ ప్రాంగణంలోని సుందరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల నాయకులు బీఎంఆర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి. ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొమ్మిడి వెంకట్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఆంద్రూ, నాయకులు కేబుల్ రాజు, శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భిక్షపతి ముదిరాజ్, కృష్ణయాదవ్, అనంతరెడ్డి, శ్రీశైలం, ధన్‌రాజ్, నరేందర్‌గౌడ్, ప్రసాద్‌రెడ్డి, కుమార్, నర్సింహ, రాజు, నిరంజన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

త్రిపుర గవర్నర్‌ను కలిసిన ఇంద్రసేనారెడ్డి



త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డితో పంచాయతీరాజ్ ఏఈ

ఇబ్రహీంపట్నం రూరల్: త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని ఇబ్రహీంపట్నం పంచాయతీరాజ్ ఏఈ ఇంద్రసేనారెడ్డి శనివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ పరిస్థితులపై చర్చించారు. కొత్త ప్రభుత్వం పాలనాతీరుపై ఆరాతీశారు. పంచాయతీరాజ్ ఉద్యోగుల అభివృద్ధి, సంక్షేమం గురించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని కోరారు.

'108'లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు: ఈఎంఆర్ఐ–108 అంబులెన్స్‌లో పైలెట్‌గా పని చేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ రమేశ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు హయత్‌నగర్‌లోని 108 కార్యాలయంలో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత మరియు బ్యాడ్జ్ లైసెన్స్ లేదా హెవీ లైసెన్స్‌తో పాటు డ్రైవింగ్‌లో రెండేళ్ల అనుభవం ఉండాలన్నారు. ఇతర సమాచారం కోసం సెల్ నంబర్ 8309924615లో సంప్రదించాలని కోరారు.

ఫ్రీ జర్నీ

మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం

- గుర్తింపు కార్డులు చూపితే ఉచిత ప్రయాణం
- మహిళలు, బాలికల హర్షం

అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం పథకానికి చట్టబద్ధత కల్పిస్తూ తొలి సంతకం చేసింది. మహాలక్ష్మి పథకంలో భాగమైన ఆర్టీసీ ఉచిత ప్రయాణాన్ని శనివారం మధ్యాహ్నం 2గంటలకు జిల్లా పరిధిలోని అన్ని డిపోల్లో అధికారికంగా ప్రారంభించారు. జీరో టికెట్‌పై ప్రయాణించిన మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.



ఇబ్రహీంపట్నం: మహిళల ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రారంభించి ప్రయాణికులతో కలిసి ఆనందం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మొయినాబాద్: అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండు రోజులకే ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రారంభించింది. మహాలక్ష్మి పథకం పేరిట మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభించింది. దీంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే మహిళలకు చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. ఏదో ఒక గుర్తింపు కార్డు చూపిస్తే చాలు తెలంగాణ రాష్ట్రంలో ఎంత దూరమైన ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ పథకం ప్రారంభం కావడంతో మహిళలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేలాది మందికి ప్రయోజనం

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ప్రతి రోజు వేలాది మంది మహిళలకు ప్రయోజనం చేకూరుతుంది. మండలంలో సుమారు 30 వేల మంది మహిళలు ఉన్నారు. వీరిలో 40 శాతం మంది ఏదో ఒక పనిమీద బస్సుల్లో ప్రయాణం చేస్తుంటారు. హైదరాబాద్ నగరానికి అతి చేరువ మండలమవ్వడంతో ప్రయాణికులు సహజంగానే ఎక్కువగా ఉంటారు. కొంత మంది పనులు, చదువులకోసం వెళ్తుంటారు. వీరంతా ఇప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగానే ప్రయాణం చేస్తారు. మరోవైపు మొయినాబాద్ మండలంలో ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలు ఉండటంతో నగరం నుంచి వేలాది మంది విద్యార్థినులు ఆర్టీసీ బస్సుల్లో వస్తుంటారు. వారికి సైతం ఉచిత ప్రయాణం ఉపయోగపడుతుంది.

సీఎంకు కృతజ్ఞతలు

ఇబ్రహీంపట్నం: మహాలక్ష్మీ పథకం కింద మహిళల ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమాన్ని శనివారం మధ్యాహ్నం 2గంటలకు ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో ప్రారంభించారు. స్థానిక ఆర్టీసీ డీఎం వెంకటనర్సప్ప, అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఓ బస్సును ముస్తాబు చేసి బస్టాండ్ తీసుకోచ్చారు. అక్కడ సోషల్ వెల్ఫేర్ కళాశాల ప్రిన్సిపల్ జానికి, మున్సిపల్ చైర్ పర్సన్ స్రవంతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, పట్టణ అధ్యక్షురాలు మల్లిక, కౌన్సిలర్లు మమత, మంగ. పార్టీ నాయకులు ఈ ఉచిత ప్రయాణ కార్యక్రమ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

వయస్సుతో సంబంధం లేకుండా ప్రయాణం



మహేశ్వరం: డిపో ఎదుట ఫ్రీ జర్నీని ప్రారంభిస్తున్న డీఎం మోహన్‌రెడ్డి

మహేశ్వరం: ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి కోరారు. శనివారం మహేశ్వరం ఆర్టీసీ డిపోలో ఆయన ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. వయస్సుతో సబంధం లేకుండా మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్స్ ఈ ఉచిత ప్రయాణం ఉపయోగించుకోవచ్చని సూచించారు. ప్రయాణ పరిధి విషయంలో ఎలాంటి పరిమితులుండవన్నారు. ఈ ఉచిత ప్రయాణాన్ని డీఎం పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఎస్ఐ నర్సింహులు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టికెట్ తీసుకోలేదు



మాది కొడంగల్. మొయినాబాద్‌లో ఉంటూ కూలీ పని చేసుకుంటాం. ఓట్లకోసం ఊరికి వెళ్లాను. ఈ రోజే మొయినాబాద్‌కు వచ్చాను. కొడంగల్ నుంచి మొయినాబాద్ వరకు బస్సులో టికెట్ తీసుకోలేదు. అక్కడి నుంచి ఇక్కడికి రూ.150 చార్జి ఉంటుంది. ప్రభుత్వం ఉచిత ప్రయాణం పథకం పెట్టడంతో మాకు చార్జీల బాధ తప్పినట్టే. చార్జీలకు పెట్టే డబ్బులు పొదుపు చేసుకుంటాం. – తుల్జమ్మ, కొడంగల్

ఆధార్ కార్డు చూపిస్తే చాలు



వికారాబాద్ నుంచి మొయినాబాద్‌కు మా బంధువుల వద్దకు వచ్చాం. నా భర్తకు టికెట్ తీసుకున్నారు. నాకు తీసుకోలేదు. ఆధార్ కార్డు చూపిస్తే డబ్బులు అవసరంలేదన్నారు. చార్జీలు లేకుండా బస్సుల్లో ప్రయాణించడం బాగుంది. ఇది మాలాంటి పేదోళ్లకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

– పార్వతమ్మ, వికారాబాద్

సీఎంను చూడాలని వస్తే దోచేశారు...

పోలీసులకు ఫిర్యాదు చేసిన బెల్జియం దేశస్తుడు

వెంగళరావునగర్: పుణ్యక్షేత్రాలు దర్శించి తెలంగాణ నూతన ముఖ్యమంత్రిని కూడా కలుద్దామని వచ్చిన బెల్జియం దేశస్తుడిని దుండగులు దోచుకున్న సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు..బెల్జియం దేశానికి చెందిన సబిద్ సిల్వ అనే వ్యక్తి ఇటీవల తల్లిదండ్రులు మృతిచెందడంతో గోవాలోని మారిగో ప్రాంతానికి వచ్చి నివాసం ఉంటున్నాడు. కొద్దిరోజుల కిందట చెన్నైలోని గోల్డెన్ టెంపుల్‌తో పాటు రిషికేష్ తదితర ప్రాంతాలను సందర్శించాడు. మూడు రోజుల కిందట తన సోదరుడు తెలంగాణాకు నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీకి చెందిన రేవంత్‌రెడ్డి నియమితులయ్యారని, ఆయనను కలవాలని మెయిల్ ద్వారా సూచించాడు. దాంతో 8వ తేదీన సికింద్రాబాద్‌లో దిగి అక్కడ నుంచి జూబ్లీహిల్స్‌లోని సీఎం ఇంటి వద్దకు చేరుకున్నాడు. సాయంత్రం 7 గంటలైనా సీఎంను కలిసే వీలు కలగకపోవడంతో మరో అరగంట తర్వాత రోడ్–45లో సికింద్రాబాద్ వెళ్లడానికి ఆటో ఎక్కాడు. మార్గమధ్యలో తన వద్ద ఇండియన్ కరెన్సీ లేవని, వాటిని మార్చి ఇస్తానని ఆటో డ్రైవర్‌కు చెప్పాడు. అందుకు సరేనని ఒప్పుకున్న ఆటోవాలా తన మిత్రులకు ఫోన్ చేసి విషయం చెప్పి.. మార్గమధ్యలో మరో ఇరువురిని ఎక్కించుకున్నాడు. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత ఆటో యూసుఫ్‌గూడ జానకమ్మ తోట వద్ద నిలిపివేశారు. ముగ్గురు కలిసి సబిద్‌సిల్వపై పదునైన ఆయుధంతో దాడి చేశారు. అనంతరం అతని వద్ద ఉన్న డబ్బులు, ల్యాప్‌టాప్, ఫోన్, దుస్తులు లాక్కొని పారిపోయారు. దిక్కుతోచని సబిద్ సిల్వ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దంపతుల హత్య కేసులో ముగ్గురి అరెస్టు

బంజారాహిల్స్: అప్పు తిరిగి ఇవ్వడంలో జాప్యం చేస్తున్నాడని ఆగ్రహానికి గురై..దంపతులను దారుణంగా హత్యచేసిన ముగ్గురు నిందితులను ఫిల్మ్‌నగర్ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఫిల్మ్‌నగర్ పోలీసులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫిల్మ్‌నగర్ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ .. ఫాతిమా ఖాద్రీ దంపతుల హత్యకేసును ఛేదించి నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. ప్రధాన నిందితుడు మహ్మద్ అజ్గర్ నుండి ఖాద్రీ రూ.20 లక్షలు తీసుకున్నాడు. ఈ డబ్బులు తిరిగి ఇచ్చే విషయంలో ఖాద్రీకి, అజ్గర్‌కు మధ్య తీవ్ర గొడవ జరిగింది. దీంతో అజ్గర్ తన స్నేహితులు మహ్మద్ సమీర్, మహ్మద్ సల్మాన్‌తో కలిసి హత్యచేశారు. నవంబర్ 28న ఖాద్రీని మొదట కిడ్నాప్ చేసి హత్యచేసి గోతిలో పూడ్చిపెట్టారు. ఈ విషయం ఫాతిమా బయట పెడుతుందేమో అని నవంబర్ 29న ఆమె ఆసుపత్రి నుండి ఇంటికి రాకముందే లోనికి ప్రవేశించి ఇంట్లోకి రాగానే చున్నీతో ఉరివేసి హత్యచేశారు. మృతురాలి చెల్లి ఫిర్యాదు మేరకు హత్యకేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా నవీన్ కాలనీ, సత్యాకాలనీ ప్రాంతాల్లో 400 సీసీ కెమెరాలను పరిశీలించి ఎట్టకేలకు నిందితుల జాడను కనిపెట్టి అరెస్టు చేశారు. దంపతులను తామే హత్యచేశామని నిందితులు అంగీకరించారు. ప్రధాననిందితుడు అజ్గర్ హత్యచేసిన అనంతరం ముంబైకి పరారై ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి దాక్కున్నాడు. మణికొండలో మరో నిందితుడు మహ్మద్ సల్మాన్‌ను సీసీ కెమెరాల్లో గుర్తించి విచారించగా హత్య గుట్టు రట్టయ్యింది. ఇదిలా ఉండగా మృతురాలు ఫాతిమా రెయిన్‌బో ఆసుపత్రిలో డైటీషియన్‌గా పనిచేస్తుండగా, భర్త ఖాద్రీ రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు గొర్రెల వ్యాపారం చేస్తాడని పోలీసులు తెలిపారు. ఖాద్రీని పూడ్చిపెట్టిన ప్రాంతంలో తవ్వకాలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీసి మార్చురీకి తరలించారు. హత్యకు పాల్పడిన మహ్మద్ అజ్గర్, మహ్మద్ సమీర్, మహ్మద్ సల్మాన్‌ను రిమాండ్‌కు తరలించి ఫిల్మ్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



హత్యకు గురైన దంపతులు జుబేర్ అహ్మద్ ఖాద్రీ, ఫాతిమా (ఫైల్)

'గృహజ్యోతి'కి కసరత్తు!

- పథకంతో 15లక్షల మందికి మేలు
- వందరోజుల్లో అమలుకు యత్నం
- డిస్కంపై రూ.60కోట్ల భారం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆరు గ్యారంటీల హామీల్లో భాగంగా ఇప్పటికే మహాలక్ష్మీ, చేయూత పథకాలను అమల్లోకి తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తాజాగా గృహజ్యోతి పథకంపై దృష్టి సారించింది. నెలకు 200 యూనిట్లలోపు వాడే గృహ వినియోగదారులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వంద రోజుల్లో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకురావాలని భావిస్తోంది. ఈ మేరకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కసరత్తు ప్రారంభించింది. ఈ పథకం అమల్లోకి వస్తే జిల్లా పరిధిలో సుమారు 15 లక్షల గృహ వినియోగదారులకు నెలవారీ విద్యుత్ బిల్లుల నుంచి ఊరట లభించే అవకాశం లేకపోలేదు.

జనవరి నుంచే అమలు..?

ఉమ్మడి జిల్లాలోని సరూర్‌నగర్, రాజేంద్రనగర్, సైబర్‌సిటీ, వికారాబాద్, మేడ్చల్ సర్కిళ్ల పరిధిలో సుమారు 36 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లుండగా, వీటిలో గృహ విద్యుత్ కనెక్షన్లు దాదాపుగా 30 లక్షలు ఉన్నట్లు అంచనా. వీరిలో నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడే గృహ వినియోగదారులు సుమారు 15 లక్షల ఉన్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అంచనా వేసింది. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్య శ్రీ రెండు కీలక హామీలను నెరవేర్చిన ప్రభుత్వం.. తాజాగా గృహజ్యోతిపై దృష్టి సారించినట్లు తెలిసింది. జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ఈ పథకాన్ని సైతం అమల్లోకి తీసుకురాబోతున్నట్లు సమాచారం.



రూ.60కోట్ల భారం

గ్రేటర్ జిల్లాల పరిధిలో రోజుకు సగటున 55 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతుంది. దీనిలో 40 శాతం విద్యుత్ గృహ అవసరాలకే వినియోగిస్తున్నారు. మెజార్టీ విద్యుత్ వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక అవసరాలకే ఖర్చవుతోంది. సంస్థకు అధిక ఆదాయం ఆ వర్గాల నుంచే లభిస్తుంది. గృహ, పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారుల నుంచి బిల్లుల రూపంలో నెలకు (సాధారణ రోజుల్లో) రూ.700 కోట్ల వరకు రెవెన్యూ వస్తుంది. అదే వేసవిలో ఈ బిల్లులు రూ.900 కోట్ల వరకు వసూలవుతుంది. ప్రభుత్వ ఉచిత విద్యుత్ హామీతో సంస్థపై నెలకు రూ.60కోట్ల వరకు భారం పడనుంది. ఇప్పటికే పీకల్లోతు నష్టాల్లో కూరుకు పోయిన విద్యుత్ పంపిణీ సంస్థకు ఈ ఉచిత విద్యుత్ పథకం గుదిబండగా మారనుందనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల భవిష్యత్‌లో సంస్థ మనుగడే ప్రశ్నార్థకంగా మారనుందనే వాదన లేకపోలేదు. అయితే సంస్థను పూర్తిగా ప్రక్షాళణ చేయడం వల్ల ఈ భారం నుంచి బయటపడేయ్యేచ్చనే వాదన కూడా బలంగా వినిపిస్తోంది.

నష్ట నియంత్రణతో భారం దూరం

టెక్నికల్, కమర్షియల్, ఇతర అంతర్గత నష్టాలను అధిగమించడం ద్వారా ప్రభుత్వం పేద, మధ్య తరగతి గృహ వినియోగదారులకు సమర్థవంతంగా ఉచిత విద్యుత్ ఇవ్వొచ్చు. జవాబుదారీ తనంతో, నిజాయితీగా పనిచేసే ఇంజనీర్లకు కీలకమైన ఫోకల్ పోస్టుల్లో కూర్చోబెట్టడం, టెక్నికల్, కమర్షియల్ నష్టాలను తగ్గించుకోవడం వల్ల సంస్థపై కనీస భారం లేకుండా ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయవచ్చని నిపుణులు అభిప్రాయం. లూజ్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్స్, ఓవర్ లోడు తగ్గించడం, మీటర్ బైఫర్‌కేషన్ పేరుతో అనవసర ఎస్టిమేషన్లు వేయకుండా ఉండటం, సబ్‌స్టేషన్లకు ప్రత్యామ్నాయ లైన్ల ఏర్పాటు పేరుతో సంస్థ చేస్తున్న దుబారా ఖర్చులను తగ్గించుకోవడం, కేటగిరీల వారిగా కనెక్షన్లు గుర్తించి, పక్కగా రీడింగ్ నమోదు చేసి, బిల్లులు జారీ చేయడం, హెచ్‌టీ సరీ్వసులపై గట్టి నిఘాను ఏర్పాటు చేయడం. స్మార్ట్ మీటరింగ్, ఆటో మెటిక్ మీటర్ రీడింగ్ సరీ్వసులను ఏర్పాటు చేయడం, హెచ్‌టీ మీటర్ రీడింగ్ నమోదులో అలసత్వం వహించిన ఏడీఈలపై చర్యలు తీసుకోవడం, సీటీపీటీలో తలెత్తే సాంకేతిక సమస్యలను సరి చేయడం, అవినీతి ఆరోపణలు ఉన్న అధికారులను కీలక పోస్టుల నుంచి తప్పించడం, సంస్థను పూర్తిగా ప్రక్షాళన చేయడంతో పాటు డీపీఈ, విజిలెన్స్ వింగ్‌లను మరింత బలోపేతం చేయడం ద్వారా సంస్థపై పైసా భారం పడకుండా ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయవచ్చనే అభిప్రాయం కూడా ఉంది.

జల్సాల కోసం బైక్‌ల చోరీ

- వాహనాల తనిఖీలో పట్టుబడిన ముగ్గురు నిందితులు
- కేసు నమోదు, రిమాండ్
- వివరాలు వెల్లడించిన సీఐ రామాంజనేయులు

యాచారం: జల్సాలకు అలవాటు పడి బైక్‌లు చోరీ చేసిన ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం మండలం గాండ్లగూడెం చెందిన ఉదయ్‌కిరణ్, మంచాల మండల కేంద్రానికి చెందిన శివ, వనస్థలిపురానికి చెందిన వంశీలు ముగ్గురు స్నేహితులు. వీరు ఆయా గ్రామాల్లో రిజిస్టర్ చేయని బైక్‌లను చోరీ చేస్తూ ఆ బైక్‌లను విక్రయించి వచ్చిన డబ్బులతో జల్సా చేసుకునేవారు. ఆ ముగ్గురు ఇటీవల కాలంలో కందుకూర్ మండల పరిధిలోని ఉట్లపల్లి, సార్లరావులపల్లి, కడ్తాల్‌లో మూడు బైకులు చోరీకి పాల్పడ్డారు. గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు శనివారం ఉదయం మీరాఖాన్‌పేట గ్రామ శివారులో వాహనాల తనిఖీలు చేపడుతున్నా క్రమంలో ఒకే బైకుపై ఉదయ్‌కిరణ్, శివ, వంశీలు వెళ్తున్నారు. వాహనాల తనిఖీలో భాగంగా అనుమానంతో వారిని విచారించగా అసలు విషయం ఒప్పుకున్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

రానున్న రోజుల్లో బీజేపీదే కీలక పాత్ర


మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

- మాజీఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- కాంగ్రెస్ బలహీనపడటం ఖాయం
- పార్టీ ఓడిన ఓటింగ్ శాతం పెరిగింది
- ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం

చేవెళ్ల: రాష్ట్రంలో రానున్న రోజుల్లో బీజేపీ కీలక పాత్ర పోషించనుందని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో శనివారం బీజేపీ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో అసెంబ్లీ ఎన్నికల ఓటమిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధికార ప్రతినిధి విఠల్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల్లో పార్టీ ఓటమి, ఓటింగ్ శాతంపై సమీక్ష నిర్వహించారు. ఓడిన ఈ ఎన్నికల్లో పార్టీకి ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఓటమికి గల కారణాలను జరిగిన లోటు పాట్లను సమావేశంలో చర్చకు తీసుకొచ్చారు. అనంతరం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అవినీతి ఎక్కువగా జరిగిందని విమర్శించారు. కాళేశ్వరమే అవినీతిలో కూరుకపోయిందని అనుకుంటే ప్రస్తుతం విద్యుత్‌శాఖలో సైతం అవినీతి బయటపడిందన్నారు. రానున్న ఏ ఎన్నికైన సరే ఇక కాంగ్రెస్, బీజేపీల మధ్య పోటీ ఉంటుందన్నారు. గోవా రాష్ట్రంలో బీజేపీ పాలన ఎంతో భాగుందని అక్కడ పాలనలో విద్య, వైద్యం అమలు తీరును పరిశీలించేందుకు చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలను గోవాకు తీసుకెళ్తానని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు ఓటమి సహజమన్నారు. రాబోయే ఎన్నికలను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కంజర్ల ప్రకాశ్, నియోజకవర్గం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అత్తెల్లి అనంత్‌రెడ్డి, బీర్ల నర్సింహ్మా, కిరణ్, సురేశ్, వెంకట్‌రెడ్డి, శర్వలింగం, అశోక్, అభిలాస్, ప్రవీణ్, నాగరాజు, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన

- మహాలక్ష్మి పథకంతో మేలు
- ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్


మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న వీర్లపల్లిశంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనతోనే ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మిపథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి రామేశ్వరం వరకు బస్సులో ప్రయాణించారు. రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహాలక్ష్మి పథకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఆరు గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను ప్రారంభించినట్లు ఆయన వివరించారు. మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలు ఎక్కడినుంచైనా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయొచ్చన్నారు. ఈ పథకాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని వీర్లపల్లి శంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు వెంకట్ రాంరెడ్డి, తాండ్రవిశాలశ్రవణ్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రావణి, డీఎం ఉష, ఎంపీపీ ప్రియాంకగౌడ్, రమాదేవి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్యయాదవ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొంకళ్లచెన్నయ్య, బాబర్‌అలీఖాన్, యండీ ఇబ్రహీం, మసూద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో పూర్తి విచారణ చేపట్టాలి

- గిరిజన బిడ్డకు న్యాయం జరగకపోతే ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- సేవాలాల్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సంజీవ్‌నాయక్


మాట్లాడుతున్న గిరిజన సంఘాల నాయకులు

షాద్‌నగర్‌రూరల్: శ్రీనునాయక్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో పోలీసులు పూర్తి విచారణ చేపట్టి నిందితులను అరెస్టు చేయాలని సేవాలాల్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సంజీవ్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని దేవీగ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17న పథకం ప్రకారమే శ్రీనునాయక్‌పై హత్యాయత్నం చేశారన్నారు. హత్యాయత్నం జరిగి రోజులు గడుస్తున్నా పోలీసులు నిందితులను పట్టుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో రియల్ ఎస్టేట్ మాఫియా ఉందని, దీంతో కొందరిని మాత్రమే పట్టుకుని మిగతా వారిని అరెస్టు చేయకపోవడం బాధాకరమని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా అసలు నిందితులను తక్షణమే పట్టుకొని అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని యెడల 14న గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో లక్ష్మణ్ నాయక్, బాలునాయక్, సరోజాబాయి, సుధీర్, చక్రవర్తి, అరుణ్, లక్ష్మణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

యాచారం: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన శ్రీశైలం శనివారం మధ్యాహ్నం యాచారం పోలీస్ స్టేషన్ సమీపంలోని డీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్లో ఓ శుభాకార్యానికి హాజరై ఇంటికి తిరుగు ప్రయనమయ్యాడు. ఫంక్షన్ హాల్ ఎదుట సాగర్‌రోడ్డు దాటుతున్న క్రమంలో యాచారం నుంచి మాల్ వైపు వేగంగా వెళ్తున్న దేవరకొండకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీశైలాన్ని బలంగా ఢీకొట్టింది. విషయం గమనించిన స్థానికులు 108లో నగరంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. యాచారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లైన్‌మెన్ ఆత్మహత్య


సుధాకర్ (ఫైల్)

పహాడీషరీఫ్: కుటుంబ కలహాలతో జల్‌పల్లి వాటర్ మెన్ ఉరేసుకున్న సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం..జల్‌పల్లి గ్రామానికి చెందిన జి సుధాకర్(48) స్థానిక మున్సిపాలిటీలో వాటర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఇటీవలి కాలంలో తరచూ భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేది. మూడు రోజుల క్రితం అతని భార్య ఇద్దరు కుమారులతో కలిసి పురానాపూల్‌లోని తన పుట్టింటికి వెళ్లింది. దీంతో అతను మానసిక ఆవేదనకు గురై తాగిన మైకంలో సుధాకర్ శుక్రవారం ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం చేరవేశారు. ఘటనా స్థలానికి వారు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

మీర్‌పేట: వివాహం జరగడం లేదని విసుగు చెందిన ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్ కథనం ప్రకారం.. చంపాపేట హరిజన వాడకు చెందిన చిట్టూరుపల్లి నాగరాజు(28) ఓ న్యాయవాది వద్ద టైపిస్ట్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అతను వివాహం కావడంలేదని గత కొంత కాలంగా మానసికంగా ఆవేదనకు గురయ్యేవాడు. ఈ విషయంలో శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన అతను ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారించగా అతడు జిల్లెలగూడ చందన చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు వారు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.